కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకట్లే

- అన్నదాతల ఆత్మహత్యలు, నీళ్ల కోసం బాధలు
- కరెంట్‌కు గోస.. వ్యవసాయానికి తండ్లాట
- దవాఖానల్లోకి పందులు, పందికొక్కులు
- మందులు కూడా దొరకని దుస్థితి వస్తది
- ఉప్పునీళ్ల గజ్వేల్‌లో ఇప్పుడు గోదావరి నీళ్లు
- నాడు కాన్పుకు 50 వేలు.. నేడు ఉచిత కాన్పు
- జయశంకర్ సారును కించపరిచిన రేవంత్
- దుబ్బాక, గజ్వేల్ రోడ్‌షోలో మంత్రి హరీశ్

సిద్దిపేట, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/దుబ్బాక, దుబ్బాక టౌన్: 'కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కోతలు, చీకటి రోజులు వస్తాయి. దవాఖానల్లోకి పందులు, పందికొక్కులు వస్తాయి. ఖాళీ నీళ్ల బిందెలతో కొట్లాడుకొనే పరిస్థితి వస్తుంది' అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆ పార్టీకి ఓటేస్తే మనవి కష్టాల బతుకులేనని చెప్పారు. సోమవారం సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్‌లో విశ్వకర్మ ఆత్మీయ సమ్మేళనానికి హరీశ్ హాజరయ్యారు. గజ్వేల్, వర్గల్, ములుగు మండలకేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో పాల్గొన్నారు. దుబ్బాకలో సీఎం కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఆ పార్టీకి ఓటేస్తే నిండా మోసపోతామని ప్రజలను హెచ్చరించారు. అలా నమ్మి ఓటేసిన కర్ణాటక రైతుల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టు తయారైందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎందుకు గెలిపించాం అని లబోదిబో మొత్తుకుంటున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ వ్యవసాయాన్ని దండగ అంటే, కేసీఆర్ పండుగ చేశారని తెలిపారు. మన వద్ద కరెంట్ సమస్య వస్తే 24 గంటల్లోపలే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అందిస్తున్నామని అన్నారు. ఒకప్పుడు రాత్రిపూట బావుల వద్దకు పోయి మోటర్ పెట్టడానికి కటిక నేల మీద కునుకు తీసిన రోజులు ఉండేవని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో కాన్పుకు పోతే రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు అయ్యేదని, కానీ, ఇప్పుడు ప్రభుత్వ దవాఖానలు కార్పొరేట్ స్థాయిలో మారాయని, రూపాయి ఖర్చు లేకుండా ప్రసూతి చేసి కేసీఆర్ కిట్ ఇచ్చి తల్లీబిడ్డలను క్షేమంగా ఇంటివద్దకు పంపిస్తున్నామని వివరించారు.

> శివుడి నెత్తిమీద గంగమ్మ లెక్క వర్గల్ నెత్తిమీద కొండ పోచమ్మ రిజర్వాయర్‌ను కేసీఆర్ కట్టారు.
> - మంత్రి హరీశ్‌రావు

> ఒకప్పుడు దొంగ రాత్రి కరెంట్.. ఇప్పుడు నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంట్
> - మంత్రి హరీశ్‌రావు

> ఓటు అంటే మూడొద్దుల మురిపెం కాదు. ఐదేండ్ల భవిష్యత్తు. కండ్ల ముందున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటెయ్యండి.
> - మంత్రి హరీశ్‌రావు

మంత్రి హరీశ్‌రావు సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన రోడ్‌షోకు భారీ సంఖ్యలో హాజరైన మహిళలు, పురుషులు. భవనాల పైకి చేరి ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

కాంగ్రెస్ నేతలది సుతిలేని సంసారం

రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలది సుతిలేని సంసారం అని, ఎవరికి వారే సీఎం అభ్యర్థులు, వాళ్లలో వాళ్లే తన్నుకోనేందుకు సరిపోతుంది అని హరీశ్ ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ ఎండ్రికాయల పార్టీ. ఒకరి కాళ్లు ఇంకొకరు గుంజుతరు. ఎవరూ ముందుకు పోరు. ఇగ, ఇప్పుడొచ్చి బీజేపోడు సుట్టరికం కలుపుతున్నాడు. బీజేపీ వాడు ఒక్క మంచిపని చేసిండా? రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1,000 చేసిండు. పాల మీద, చేనేత పరిశ్రమ మీద జీఎస్టీ వేసిండు. బాయికాడ మీటర్ పెట్టుమన్నాడు. మీ ఇంటికాడికి బిల్లుపంపుతానన్నాడు. బీజేపీ, కాంగ్రెస్‌వాళ్లకు చేసింది చెప్పుకునే ముఖం లేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అమలు కానీ హామీలు ఇస్తున్నారు. ఈ రెండు పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని పిలుపునిచ్చారు. సిగ్గు లేకుండా వస్తున్న ఆ పార్టీవాళ్లను అక్కాచెల్లెళ్లు పొలిమేరదాకా చీపురు కట్టలతో తరిమికొట్టాలని అన్నారు. 'ఈటల రాజేందర్ ఇక్కడి ప్రజల కష్టసుఖాల్లో ఉన్నారా? కరోనా సమయంలో అందరు భయపడితే నేను మొదటి కరోనా పేషెంట్ ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పాను. ప్రజల కష్టసుఖాల్లో మనమే ఉన్నాం. అప్పుడు ఈటల రాజేందర్ వచ్చాడా?' అని నిలదీశారు.

> ఉప్పు నీళ్ల గజ్వేల్‌లో గోదావరి నీళ్లు ఉప్పొంగేలా చేసింది సీఎం కేసీఆర్. గజ్వేల్‌కు రోడ్డు, రేడియల్ రోడ్డును తీసుకొచ్చారు. రైలును సైతం తెచ్చారు.
> - మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్‌లో నీళ్ల గలగలలు

పదేండ్లలో సీఎం కేసీఆర్ హయాంలో గజ్వేల్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని మంత్రి హరీశ్ అన్నారు. నాడు చుక్క నీరు లేని గజ్వేల్ ప్రాంతాన్ని, నీళ్ల గజ్వేల్‌గా మార్చారని చెప్పారు. బోరు నీళ్ల గజ్వేల్‌కు గోదావరి నీళ్లు వచ్చాయని తెలిపారు. కాళేశ్వరం నీళ్లతో చెరువుల, చెక్‌డ్యాంలను నింపుకుంటున్నామని వెల్లడించారు. ఎండాకాలంలో హల్దివాగులో నీళ్లు నింపి జీవనదిగా మార్చారని, తాగు, సాగు నీటికష్టాలను తీర్చారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి సీఎం ఎవరు అంటే గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అంటారని, గజ్వేల్‌కు అంత గొప్ప పేరున్నదని చెప్పారు. కేసీఆర్ హ్యాట్రిక్‌గా గెలిస్తే గజ్వేల్ పేరు మరోసారి మారుమోగుతుందని తెలిపారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు.

కర్ణాటకలో ప్రజల గగ్గోలు

5 గ్యారంటీల పేరిట కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ మోసం చేయటంతో అక్కడి ప్రజలు గగ్గోలు పెడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. మెడికల్, పీజీ చదివే విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల్లో 80 శాతం కోత పెట్టిందని, ఇక రైతుల పరిస్థితి అధ్వానంగా మారిందని వెల్లడించారు. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 357 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారని వివరించారు. ఇచ్చే 3 గంటల కరెంట్ 30 సార్లు ట్రిప్ అవటంతో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని అన్నారు.

సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. భవనాల పైకి చేరి ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

జయశంకర్ సార్‌ను కించపరిచేలా రేవంత్ వ్యాఖ్యలు

తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాల నినాదం లేదని ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను కించపరిచేలా రేవంత్‌రెడ్డి మాట్లాడారని టీపీసీసీ చీఫ్‌పై హరీశ్ ధ్వజమెత్తారు. 'జయశంకర్ సార్ ఆ నినాదాన్ని ప్రజల మనసుల్లోంచి పుట్టించారు. సార్ ఆశయాల స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు' అని వెల్లడించారు.

> ఈటల రాజేందర్ తిన్నింటి వాసాలు లెక్కబెట్టారు. అన్నం పెట్టిన చెయ్యికి సున్నం పెట్టారు. రాజేందర్‌ను సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా, శాసనసభ పక్షనేతగా, మంత్రిగా చేశారు. ఇంత చేసిన కేసీఆర్‌ను విమర్శించటం ఆయనకు తగునా?
> - మంత్రి హరీశ్‌రావు

బీజేపీది మేకపోతు గాంభీర్యం

'రాష్ట్రంలో బీజేపీకి ఒకటో, రెండో సీట్లు.. దానికే మేకపోతు గాంభీర్యం. సొంత పార్టీ నాయకులకే ఆ పార్టీపై నమ్మకం లేదు. ప్రజలకైతే అసలే నమ్మకం లేదు. ఆ పార్టీ ప్రజలకు ఏమీ చేయలేదని రోజుకో నాయకుడు బయటకు వస్తున్నారు. విజయశాంతి, వివేక్, రాజగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ ఇలా రోజుకొక్కరు రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు రాజీనామా చేసి వెళ్తున్నారు. బీజేపీ మాటలన్నీ నీటిమీది రాతలు. వాళ్ల మ్యానిఫెస్టో ఓ ఫాల్స్. తమను తాము మభ్యపెట్టుకుంటూ ప్రజలను మోసపుచ్చడమే బీజేపీ లక్ష్యంగా మారింది' అని హరీశ్‌రావు విమర్శించారు. కార్యక్రమాల్లో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాస్ శ్రీనివాస్, ఎంపీపీ, జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. రోడ్‌షోలకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు, ముఖ్యంగా మహిళలు భారీగా తరలివచ్చారు.

> బీడీ కట్టలపై కాంగ్రెస్ పార్టీ పుర్రె గుర్తు పెట్టింది. బీజేపీ జీఎస్టీ వేసింది. కేసీఆర్ మాత్రం బీడీ కార్మికులకు పింఛన్లు ఇచ్చారు.
> - మంత్రి హరీశ్‌రావు

విచారణకు రాని కాంగ్రెస్ నేతలు!

- 7.4 కోట్ల ఘటనలో నోటీసులకు వివరణ ఇవ్వలేక ఇరుక్కున్న హస్తం పార్టీ నాయకులు
- ఖమ్మం, కొడంగల్, కామారెడ్డి, మల్కాజిగిరికి
- పెద్దమొత్తంలో డబ్బు తరలించేందుకే యత్నం?

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఇటీవల హైదరాబాద్ శివారు అజీజ్‌నగర్‌లో పట్టుబడిన రూ.7.4 కోట్ల నగదు ఘటనలో కాంగ్రెస్ ఖమ్మం అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులకు పోలీసులు జారీచేసిన 41 సీఆర్‌పీసీ నోటీసులకు వివరణ ఇవ్వలేక ఇరుక్కుపోయినట్టు తెలుస్తున్నది. రూ.7.4 కోట్ల నగదును అక్రమంగా తరలిస్తుండగా ఈ నెల 18న అజీజ్‌నగర్‌లో సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఆరు కార్లలో క్యాష్ కాన్వాయ్ నిర్వహించిన 10 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారికి ఆదివారం 41 సీఆర్‌పీసీ నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. నోటీసులు అందుకున్నవారిలో డబ్బును తరలిస్తూ పట్టుబడిన ఆరుగురు డ్రైవర్లుసహా నగదు వెంట ఉన్న ఇద్దరు వ్యక్తులు, శ్రీనిధి విద్యాసంస్థల అధినేత కేటీ మహితోపాటు మరో కాంగ్రెస్ నేత ఉన్నట్టు సమాచారం. కానీ, పోలీసులు మాత్రం అధికారికంగా నోటీసులు ఎవరికి జారీచేశారనేది ధ్రువీకరించలేదు. నోటీసులు అందుకున్న వారు వివరణ ఇచ్చేందుకు సోమవారం పోలీసుల ముందుకు రావాల్సి ఉండగా ఎవరూ రాలేదని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. డబ్బు రవాణా అంశంలో ఇప్పటికే పోలీసులు కాల్‌డాటా, వాట్సాప్ చాటింగ్, జీపీఎస్ లొకేషన్, డబ్బు రవాణా చేసిన కార్ల యజమానుల వివరాలతో కూడిన పక్కా ఆధారాలను పోలీసులు సేకరించి ఐటీ అధికారులకు సమర్పించినట్టు తెలిసింది. డబ్బును ముఖ్యంగా ఖమ్మం, కొడంగల్, కామారెడ్డి, మల్కాజిగిరి తదితర నియోజకవర్గాలకు తరలించేందుకు పథకం పన్నినట్టు పోలీసుల విచారణలో తేలిందని సమాచారం. రెండు మూడు రోజుల్లో పట్టుబడిన నగదుకు సంబంధించి స్పష్టత వస్తుందని పోలీసువర్గాలు తెలిపాయి. ఈ కేసును ఐటీ, పోలీస్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

లోకల్ మ్యానిఫెస్టో!

అసెంబ్లీ ఎన్నికల్లో నయా ట్రెండ్

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలు ప్రకటించడం మామూలే. కానీ, ఈసారి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త ట్రెండ్ మొదలైంది. అదే 'లోకల్ మ్యానిఫెస్టో'. సాధారణంగా రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను దృష్టిలో పెట్టుకొని పథకాలను, చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటిస్తుంటారు. కనీసం నాలుగైదు జిల్లాలను ప్రభావితం చేసే స్థాయిలో అయినా మ్యానిఫెస్టో ఉండాలని భావిస్తారు. దీంతో నియోజకవర్గ స్థాయి సమస్యలకు ఆయా మ్యానిఫెస్టోల్లో స్థానం దక్కదు. స్థానికులకు అది పెద్ద సమస్యే అయినా.. రాష్ట్రస్థాయిలో చూసినప్పుడు చిన్నగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో ఈసారి అభ్యర్థులు 'లోకల్ మ్యానిఫెస్టో'లు విడుదల చేస్తున్నారు. నియోజకవర్గంలో పంచే కరపత్రాల్లో ఆయా పార్టీలు ప్రకటించే పథకాలు ఓవైపు ముద్రించి.. మరోవైపు తమను గెలిపిస్తే నియోజకవర్గంలో ఏయే పనులు చేపట్టేది వివరిస్తున్నారు. ఆ హామీలతో ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో అధికార బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరి కంటే ముందున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా సభల్లో స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థులు మాట్లాడుతూ.. ఆ నియోజకవర్గానికి ఏమేం కావాలో నేరుగా సీఎం కేసీఆర్ ముందే వివరిస్తున్నారు. అనంతరం ఆయా హామీలను నెరవేరుస్తామని సీఎం కేసీఆర్ స్పష్టంగా హామీ ఇస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రే హామీలు ఇస్తుండటంతో ప్రజలు గట్టిగా నమ్ముతున్నారని నిపుణులు చెప్తున్నారు.

కాంగ్రెస్ ప్రీలాంచ్ బేరం!

భూమి ఉంటుంది. కానీ, నిర్మాణ అనుమతులతో పాటు ప్రాజెక్టుకు రెరా ఆమోదం ఉండదు. ఎలా కడతారో తెల్వదు. కేవలం అందమైన గ్రాఫిక్స్‌లతో కూడిన బ్రోచర్లు కనువిందు చేస్తాయి. అంతే! ఆకాశంలో మేడలు కడుతున్నట్టు ప్రచారం చేస్తారు. విల్లాకు రేటు నిర్ధారించి, కొనుగోలుదారుల నుంచి రూ.కోట్లు వసూలు చేస్తారు.
- రియల్, నిర్మాణ రంగాల్లో జరిగే ప్రీలాంచ్ వ్యాపారం ఇది. చట్టపరంగా ఇదో అవినీతి

ఎన్నికల క్షేత్రంలో ఇంకా ప్రజామోదం రాలేదు. వస్తుందన్న గ్యారంటీ లేదు. కానీ ప్రభుత్వం వస్తే పెట్టిన పెట్టుబడికి పదుల రెట్ల విలువైన హైదరాబాద్ భూములు మీ సొంతం అని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందంటూ పగటి కలల్లో విహరింపజేశారు. వందలు, వేల కోట్ల నిధులను సమీకరించారు.
- రాజకీయాల్లో తొలిసారిగా కాంగ్రెస్ తలపెట్టిన ఎన్నికల ప్రీలాంచ్ ఇది. రాజకీయంగా ఇదో దుర్నీతి

- గెలిస్తే, హైదరాబాద్‌లోని భూములను పంచుతామంటూ ఎర
- తెలంగాణ ఎన్నికలకు కర్ణాటక కాంగ్రెస్ భారీ నిధుల సమీకరణ
- తెలంగాణ గడ్డ మీదకు కన్నడ కాంగ్రెస్ దండు.. ఏఐసీసీ భారీ స్కెచ్
- ఎన్నికల్లో క్లస్టర్ ఇన్‌చార్జీలుగా ఏకంగా పది మంది కర్ణాటక మంత్రులు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే, హైదరాబాద్ భూములన్నీ ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలకే

(గుండాల కృష్ణ–హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి)

నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఇప్పుడు ప్రీలాంచ్ వంటి నీచ రాజకీయానికి ఒడిగట్టింది. పైగా, నాలుగు శతాబ్దాల చరిత్ర ఉన్న విశ్వ నగరం హైదరాబాద్‌ను పావుగా మార్చింది. ఇక్కడి విలువైన భూములను ఎరగా చూపి... తెలంగాణ ఎన్నికల్లో పెద్ద ఎత్తున నోట్ల వరద పారించేందుకు బెంగళూరు వేదికగా భారీ స్థాయిలో నిధుల సమీకరణ పూర్తి చేసినట్టు ఆరోపణలున్నాయి. ఐటీ దాడుల్లో కోట్ల కట్టలు బయటపడటం ఇందుకు బలాన్ని చేకూర్చింది. అంతేకాదు గతంలో ఎన్నడూ లేనివిధంగా కర్ణాటక ప్రభుత్వం దాదాపుగా తెలంగాణలో మోహరించడం అనేక సందేహాలకు ఊతమిస్తున్నది. మరి, కాంగ్రెస్ పాచికనే పారితే హైదరాబాద్ భూములు కర్ణాటకకు పందేరం కానున్నాయనేది సుస్పష్టం.

సమీకరణ ముసుగులో భూ పెట్టుబడులు

తెలంగాణ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీకి బెంగళూరు నుంచి నిధుల వరద వస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కర్ణాటకలోని అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి కోట్లాది రూపాయల సేకరణ జరిగినట్లు తెలుస్తున్నది. ఒక్కొక్కరి నుంచి కనిష్ఠంగా రూ.50 కోట్ల చొప్పున సేకరించారని ప్రచారం జరుగుతున్నది. అయితే ఇందుకు హైదరాబాద్ చుట్టుపక్కల భూములను ఎరగా చూపినట్లు సమాచారం. తెలంగాణ ఎన్నికల కోసం కాంగ్రెస్‌కు ఆర్థికంగా చేయూతనిచ్చిన వారికి.. అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున భూములను అప్పగించేందుకు కుట్రపన్నినట్టు సమాచారం అందుతున్నది. వారు ఇచ్చిన మొత్తానికి రెండు, మూడు రెట్ల ప్రతిఫలం ఉండేలా నగరం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను ధారాదత్తం చేస్తామని చెప్పి నిధుల సమీకరణ ముగించినట్లు తెలిసింది. గత పదేండ్లలో బెంగళూరును మించి హైదరాబాద్ ఐటీ, పారిశ్రామికంగా దూసుకుపోతుండటం, అంతకుమించి అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాయి. దీంతో దేశంలో ఇతర ఏ రాష్ట్రాల్లో లేనివిధంగా ఇక్కడి రియల్, నిర్మాణ రంగం దూసుకుపోతున్నది. కొంత కాలం కిందట ప్రభుత్వపరంగా జరిగిన భూముల వేలంలో కోకాపేటలో ఎకరం రూ.100.75 కోట్లు పలకడంతో దేశవ్యాప్తంగా ఇక్కడి భూములకు భారీగా డిమాండు వచ్చింది. ఈ నేపథ్యంలో కర్ణాటకకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా తామిచ్చిన దానికంటే ఎక్కువ విలువైన భూములు దక్కుతాయనే ఆశతో పెద్ద ఎత్తున నిధుల సమీకరణకు సహకరించినట్టు తెలుస్తున్నది.

ఐటీ శాఖకూ సమాచారం

తెలంగాణ ఎన్నికల కోసం కాంగ్రెస్ బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున నోట్ల కట్టలను మళ్లిస్తుందనే ప్రచారం చాలా రోజుల కిందటనే జరిగింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు కూడా ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో ప్రస్తావించారు. సాధారణంగా ఇవన్నీ రాజకీయ ఆరోపణలు అనుకున్నారు. కానీ ఇది వాస్తవమేనన్న సమాచారం ఐటీ శాఖకు కూడా ముందుగానే ఉన్నట్లుగా తెలుస్తున్నది. అందుకే ఇటీవల బెంగళూరు నగరంలో ఏకంగా 45 చోట్ల ఐటీ శాఖ దాడులు నిర్వహించింది. కర్ణాటక ప్రభుత్వ కాంట్రాక్టర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబికాపతి ఇంట్లో రూ.42 కోట్లు, మాజీ ఎమ్మెల్సీ కాంత రాజ్‌కు సన్నిహితుడైన బిల్డర్ సంతోశ్ ఇంట్లో రూ.45 కోట్లు పట్టుబడ్డాయి. నిందితులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడం, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితులవ్వడంతో కాంగ్రెస్ కోట్ల కట్టల స్కామ్‌కు పాల్పడిందన్న అనుమానాలు పెరిగాయి. మిగతా మరికొన్ని చోట్ల జరిపిన సోదాల్లో మరో రూ.7 కోట్ల వరకు బయటపడినప్పటికీ... అప్పటికే భారీ మొత్తం సరిహద్దులు దాటాయనే వార్తలు కూడా వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ నేతలు చెబుతున్న వ్యాఖ్యలు నిజమేనని తేలింది. ముఖ్యంగా ఆ రాష్ట్ర బీజేపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అశ్వత్ నారాయణ్ ఐటీ దాడుల్లో బయటపడిన నోట్ల కట్టలపై సంచలన వ్యాఖ్యలు కూడా చేశారు. తెలంగాణ ఎన్నికల కోసమే కర్ణాటక కాంగ్రెస్ నిధుల సమీకరణ చేసిందని, ఐటీ శాఖలో బయటపడిన సొమ్ము కూడా అందులో భాగమేనని ఆయన కుండబద్దలు కొట్టారు. అంటే, తెలంగాణ కాంగ్రెస్‌కు బెంగళూరు వేదికగానే రాజకీయ వ్యూహాలతో పాటు ఆర్థికంగానూ సంపూర్ణ సహకారం అందుతున్నట్లుగా బయటి ప్రపంచానికి తెలిసింది.

పది క్లస్టర్లుగా తెలంగాణ.. అంతా కర్ణాటక మంత్రులే

సాధారణంగా ప్రదేశ్ కాంగ్రెస్‌లు ఏఐసీసీ కనుసన్నల్లో నడుస్తాయి. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఇది రివర్స్‌గా మారిపోయింది. తెలంగాణ ఎన్నికల కార్యచరణ పెత్తనాన్ని బెంగళూరు పవర్ సెంటర్‌కు ఫ్రీ హ్యాండ్‌గా ఇచ్చినట్లు తెలుస్తున్నది. తెలంగాణ కాంగ్రెస్ నేతలు టికెట్ల ఖరారు మొదలు ప్రతి చిన్న అంశానికీ బెంగళూరు వైపే తొంగి చూశారు. తెలంగాణలో ఇప్పటివరకు 54 మంది ఎన్నికల పరిశీలకులను కాంగ్రెస్ నియమిస్తే.. వీరంతా కర్ణాటకకు చెందిన వారే కావటం గమనార్హం. తెలంగాణను పది ఏఐసీసీ క్లస్టర్లుగా విభజిస్తే, ఆ పదింటికీ కర్ణాటక మంత్రులను ఇన్‌చార్జీలుగా నియమించడం గమనార్హం. ఏఐసీసీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా మొదటి జాబితాలో 48 మందిని ప్రకటిస్తే అందరూ కర్ణాటకకు చెందినవారే ఉన్నారు. వీరిలో 25 మందికి పైగా కర్ణాటక ఎమ్మెల్యేలు ఉంటే మిగిలినవారు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారు, ఇతర నేతలు ఉన్నారు. మిగిలిన స్థానాల జాబితాలోనూ ఇన్‌చార్జీలుగా కర్ణాటకకు చెందిన వారు ఎంత మంది ఉండనున్నారనేది జాబితా విడుదలైతే గానీ చెప్పలేం. ముసుపెన్నడూలేని విధంగా బెంగళూరు వేదికగా రాజకీయ వ్యూహరచన, నిధుల సమీకరణ.. దీనికి తోడు కర్ణాటక ప్రజాప్రతినిధులనే ఇక్కడ భారీఎత్తున మోహరించటం అనుమానాలకు కొండంత బలాన్ని చేకూరుస్తున్నాయి.

బెంగళూరు నుంచే..

సాధారణంగా ఎన్నికలు రాగానే జాతీయ పార్టీలు ఢిల్లీ వైపు చూస్తాయి. ఆ పార్టీల నాయకులు ఢిల్లీలో ఎక్కిన గడప... దిగిన గడప... అన్నట్లుగా టికెట్ల కోసం పైరవీలు చేసుకుంటారు. రాజకీయ వ్యూహాలు, ఇతరత్రా సమీకరణలన్నీ దేశ రాజధానిలోనే రూపొందిస్తారు. కానీ తాజాగా తెలంగాణ ఎన్నికల ముఖచిత్రంలో కాంగ్రెస్ వైఖరి విచిత్రంగా... ఒకరకంగా ఆందోళనకరంగా తయారైంది. కేవలం తెలంగాణ కాంగ్రెస్ నాయకులే కాదు.. చివరకు ఢిల్లీ జాతీయ నేతలు సైతం బెంగళూరు వైపు మాత్రమే చూస్తున్నారు. ఒక రాజకీయ పార్టీ తన కార్యకలాపాలను ఎక్కడ నుంచి కొనసాగించాలనేది దాని ఇష్టం. ఇందులో ఎవరికీ పెద్ద అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. కాకపోతే... తెలంగాణ గుండెకాయలాంటి హైదరాబాద్ భవిష్యత్తును పణంగా పెట్టి బెంగళూరు వేదికగా సాగుతున్న హస్తంపార్టీ కుట్రలు అందరిలోనూ తీవ్ర ఆందోళనకు కారణమవుతుంది.

ఇన్‌చార్జి కన్నడ మంత్రులు వీరే..

- వైద్యారోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు
- పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే
- ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎంసీ సుధాకర్
- వైద్యారోగ్యశాఖ, స్కిల్‌డెవలప్‌మెంట్ శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్
- ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప
- రెవిన్యూశాఖ మంత్రి కృష్ణబైరెగౌడ
- బీసీ–కన్నడ సాంస్కృతికశాఖమంత్రి శివరాజ్ ఎస్ తంగడయి
- మైనార్టీ, గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్
- అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే
- యువజన సర్వీసులు, క్రీడా, గిరిజన సంక్షేమశాఖ మంత్రి బీ నాగేంద్ర